నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 30 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

కొనుగోళ్లు ఆలస్యం కావడంతో దొనబండ కేంద్రంలో కుప్పలుగా పోసి, పరదాలు కప్పిన ధాన్యం రాశులు

# ఆ రెండు కిలోలు బుక్కేస్తున్నదెవరో!?

## అధికారంలోకి వస్తే ధాన్యం తూకంలో గ్రాము కూడా తేడా ఉండదని హామీ ఇచ్చిన నేతలు

- ప్రస్తుతం 40 కిలోలకు బదులు.. అదనంగా 2 కిలోలు ఎక్కువ తూకం వేస్తూ దోచేస్తున్నా స్పందన కరువు
- పైగా అన్నదాతల సమ్మతితోనే తూకం వేస్తున్నారంటూ ప్రచారం
- మిల్లర్లకు మేలు చేసేలా అధికారులు, నాయకుల తీరు
- తీవ్రంగా నష్టపోతున్నామంటున్న కర్షకులు
- సమస్యల వలయంలో ధాన్యం కొనుగోళ్లు

*తాము గెలిచాక ధాన్యం తూకంలో గ్రాము కూడా తేడా ఉండదని గొప్పలు చెప్పకొచ్చిన కాంగ్రెస్ నేతలు.. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో రైతులను నిలువుదోపిడీ చేస్తున్నా నోరుమెదపడం లేదు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు బస్తాకు 42 కిలోలు తూకం వేస్తున్నారని.. అందులో రెండు కిలోలు స్వాహా చేస్తున్నారని నిరాధారమైన ఆరోపణలు చేసిన సదరు నేతలు.. మరి ఇప్పుడు కూడా అదే తీరున తూకం వేస్తున్నా స్పందించకపోవడం వెనుక మతలబేమిటన్నది ప్రశ్నార్థకమవుతున్నది. ఆ నేతలు చెప్పిన లెక్కల ప్రకారం ప్రస్తుతం ఆ రెండు కిలోలు ఎవరు బుక్కుతున్నారన్నది చర్చనీయాంశమవుతున్నది. ఇక ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడమేగాక రైతుల సమ్మతితోనే తూకం వేస్తున్నారంటూ ప్రచారం చేస్తుండగా, ఆ వర్గంలో ఆగ్రహం వ్యక్తమవుతున్నది.*

మంచిర్యాల, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఏడాదిన్నర క్రితం ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకిచ్చిన హామీలను అధికార పార్టీ నేతలు పూర్తిగా మరచిపోయారు. ఫలితంగా ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు ధాన్యం అమ్ముకునేందుకు అవస్థలు పడడంతో పాటు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో తూకంపై ప్రస్తుత కీలక నేత నిరాధారమైన ఆరోపణలు చేశారు. బస్తాకు 42 కిలోలు తూకం వేస్తున్నారని.. అందులో రెండు కిలోలు స్వాహా చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తాను గెలిస్తే తూకంలో ఒక్క గ్రాము కూడా తేడా ఉండదని.. రైతులు నష్టపోకుండా చూసుకుంటానని గొప్పలకు పోయాడు. కానీ.. ప్రస్తుతం ధాన్యం బస్తా బరువు 42 కిలోలుంటేనే దించుకుంటామని మిల్లర్లు తెగేసి చెప్పేసినట్లు సమాచారం. ఇందుకు అధికారులు సైతం సై అనడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఒక్కో బస్తాను 42 కిలోలకు తూకం వేస్తున్నారు. మరి అధికార పార్టీ నేత లెక్కల ప్రకారం ఈ రెండు కిలోలు ఎవరి జేబుల్లోకి పోతున్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒక్క గ్రాము కూడా ఎక్కువ తూకం వేయనివ్వను అన్న ఆ నేతనే.. ఇచ్చిన హామీని నెరవేర్చపోగా.. ఈ ఒక్కసారికి సహకరించండి అంటూ రైతులను బతిమిలాడుకున్నారట. పైగా రైతుల సమ్మతితోనే 42 కిలోలు తూకం వేస్తున్నామంటూ ప్రచారం చేస్తున్నారు. మరో వైపు రైస్ మిల్లర్లకు మేలు చేసేలా ఎమ్మెల్యేలు, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుళ్లకోటలో క్లీనింగ్ మిషన్ పైపు పగిలి నిరుపయోగంగా ఉన్న మిషన్

### తూర్పారా పడితేనే కొంటామంటూ జాప్యం..

మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముందు తూర్పారా పడితేనే ధాన్యం తూకం వేస్తామంటూ అధికారులు స్పష్టం చేశారు. 17శాతం తేమ వచ్చిన ధాన్యాన్ని కూడా కొనకపోగా.. తాలు.. తప్ప ఉందని.. తూర్పారా పట్టాలని తెగేసి చెప్పడంతో రైతులు నానా కష్టాలు పడాల్సి వస్తున్నది. ప్యాడీ క్లీనింగ్ యంత్రాల కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సి వస్తున్నది. మార్కెటింగ్ శాఖ నుంచి ప్యాడీ క్లీనింగ్ యంత్రాలను సమకూర్చినప్పటికీ అవి సరిగా పనిచేయడం లేదు. చాలా కేంద్రాల్లో యంత్రాలు పాడైపోయాయి. వాటికి ఉన్న పైపులు పగిలిపోయాయి. దీంతో లక్షలు ఖర్చు పెట్టి తెచ్చిన యంత్రాలు నిరుపయోగంగా మారాయి. మొన్నటి దాకా తూర్పారా పడితేనే ధాన్యం కొంటామన్న అధికారులు.. ఇప్పుడు మాట మార్చారు. యంత్రాల ఫెయిల్యూర్‌ను కప్పిపుచ్చుకోవడంతో పాటు రైస్ మిల్లర్లకు లబ్ధి చేకూర్చేందుకు తూర్పారా పట్టకపోయినా ధాన్యం తూకం వేస్తామంటున్నారు. తూర్పారా పట్టిన ధాన్యాన్ని 41 కిలోలకు తూకం వేస్తే, క్లీన్ చేయని ధాన్యాన్ని తాలు, తప్ప పేరుతో 42 కిలోలకు తూకం వేస్తూ రైతులను నిలువునా దోచేస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో శనివారం హాజీపూర్, దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల్లోని కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్రతి బస్తాను 42 కిలోలకు తూకం వేశారు. మొన్నటి దాకా తూర్పార పడితేనే ధాన్యం తూకం వేస్తామన్న అధికారులు, ఉన్న ఫలంగా నిర్ణయాన్ని మార్చుకోవడం వెనుక మతలబు ఏమిటన్నది అర్థం కావడం లేదు. ఒక్కో బస్తాకు 2 కిలోలు అధిక తూకంతో ఒక్కో లారీ లోడ్‌పై రైతులు క్వింటా ఇరవై కిలోల ధాన్యాన్ని అదనంగా మిల్లర్లకు ఇవ్వాల్సి వస్తున్నది. ఇది దోపిడీ కాక ఇంకేమిటి అని అన్నదాతలు మండిపడుతున్నారు. తూర్పారా పేరుతో ధాన్యం కొనుగోళ్లలో తీవ్రమైన జాప్యం జరిగిందని, మిషన్ల కోసం ఎదురు చూడడంలోనే రోజులు గడిచిపోయాయని వాపోతున్నారు. ధాన్యం తేమ 17 శాతం వచ్చి పది, పదిహేను రోజులవుతున్నా తూకం వేయకపోవడంతో రైతులు కేంద్రాల దగ్గరే పడిగాపులు కాస్తున్నారు. తేమ శాతం 10 శాతం నుంచి 13 శాతానికి పడిపోయినా ఇప్పటి దాకా తూకం వేసే నాథుడే లేరంటూ రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పోసి ఎప్పుడు కొంటారా అని ఎదురు చూస్తున్నారు. వర్షాలు వచ్చి ధాన్యం తడిసిపోకముందే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

### రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారు..

నేను ధాన్యం తీసుకొచ్చి నెల రోజులు దాటింది. 42 కిలోలకు ఒక బస్తా చొప్పున తూకం పెట్టినం. మిల్లుకు పోయాక బస్తాకు మరో రెండు కిలోలు అదనంగా కట్ చేసుకుంటున్నారు. ఎక్కువ తూకం వేసినంక కూడాఈ కట్ చేసుకోవడం ఏంటీ? మేము ఏం చేయాలి? రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారు. మమ్ములను బతకనిస్తలేరు. నెల రోజుల సంది ఎప్పుడు తూకం వేస్తరా? అని ఇక్కడే పడిగాపులు కాస్తున్నా. సాధ్యమైనంత తొందరగా తూకం వేయాలి.

**మోటపలుకుల మల్లేశ్, కొత్తూర్.**

### అధికారులు అడగరా..

నేను ధాన్యం పోసి 25 రోజులు అయ్యింది. అప్పటి నుంచి ధాన్యం ఆరుతూనే ఉంది. తేమ 13, 14 శాతం వచ్చాక కుప్పలు పోసిన. తూర్పార పట్టి కిలో ఇవ్వమన్నరు. ఇప్పుడేమో ఏం అవసరం లేదని రెండు కిలోలు ఎక్కువ తూకం వేస్తున్నరు. అది కాకుండా మిల్లులో మరో రెండు కిలోలు ఎక్కువ కట్ చేస్తున్నరు. కలెక్టర్ వచ్చినప్పుడు కూడా అడిగినం. తూర్పార పట్టమన్నరు. రెండు కిలోలు ఎక్కువ తూకం వేస్తున్నారంటే మిల్లర్ల దగ్గరకు పోయి ఎందుకు ఆపలేదో అర్థమైతలేదు. ప్రభుత్వం పట్టించుకోకపోతే ఎవరు పట్టించుకోవాలి. వర్షం వస్తే కుప్పలు తడుస్తాయని భయం వేస్తున్నది.

**-ఎం.మల్లేశ్, కొత్తూర్.**

### 20 రోజులైనంక తూకం

నేను కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి 20 రోజులైంది. ధాన్యం తెచ్చిన నాలుగైదు రోజులకే తేమ వచ్చేసింది. తేమ శాతం 17 నుంచి 12 శాతానికి పడిపోయాక తూకం వేశారు. అంతకు ముందు తూర్పారా పట్టాకే కొంటామన్నరు. కానీ ఇప్పుడు అవసరం లేదని చెప్పి.. నా సీరియల్ వచ్చిందని తూకం వేస్తున్నరు. తాలు, తప్ప పేరుతో 40 కిలోలు తూకం వేయాల్సిన ధాన్యం బస్తాకు 42 కిలోలకు తూకం వేస్తున్నరు. లేదంటే మిల్లర్లు దించుకోరని చెబుతున్నరు. చేసేదేమి లేక తూకం వేయిస్తున్నా.

**- గోళ్ల శ్రీనివాస్, గుళ్లకోట**

తాళ్ల పేట కొనుగోలు కేంద్రంలో 42 కిలోలు తూకం వేస్తున్న బస్తా

### కిరాయిలు పోను మిగిలేదేముంటది

నేను కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి 20 రోజులు దాటిపోయింది. ధాన్యం పోసినా నాలుగు రోజులకే తేమ శాతం 17 వచ్చింది. రెండు వారాల క్రితం చూసినప్పుడు తేమ 12కి పడిపోయింది. ఇన్ని రోజులు ఎదురు చూశాక.. నిన్న వచ్చి 42 కిలోలకు తూకం పెట్టారు. అది కూడా నేను ఎందుకు కొంటలేరని లొల్లిపెడితే తీసుకున్నరు. తేమ వచ్చిందని నా వడ్లు కుప్పపోసే రెండు వారాలు దాటింది. ట్రాక్టర్, మిషన్ కిరాయితో పాటు 20 రోజులకు పరదాల కిరాయి కడితే నాకు మిగిలేది ఏం ఉంటది. నాతో పాటు చాలా మంది రైతులు తెచ్చిన ధాన్యం తేమ వచ్చి తూకానికి సిద్ధంగా ఉంది. కానీ కొనేటోళ్లు లేక 20 రోజులకు నాకు సీరియల్ వచ్చింది. మొన్నటి దాకా తూర్పారా పట్టాలి అని చెప్పిండ్రు. కానీ మా కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ప్యాడీ క్లీనర్ యంత్రం పని చేయడం లేదు. ఎండకు పాడైపోయిందని చెబుతున్నారు. తూర్పారా పట్టాల్సిన అక్కర లేకుండా ఇప్పుడు 42 కిలోల చొప్పున తూకం వేస్తామంటున్నరు. తప్పనిసరి పరిస్థితుల్లో ఒప్పుకోవాల్సి వస్తున్నది. రైతుకు న్యాయం చేసేటోళ్లు లేరు.

**- బోళ్లకుంట శంకరయ్య, దొనబండ**

దొనబండ కొనుగోలు కేంద్రంలో పాడైపోయిన నిరుపయోగంగా కనిపిస్తున్న ప్యాడీ క్లీనర్ యంత్రం

అక్రమ వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తే కఠిన చర్యలు

- ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్
- వడ్డీ వ్యాపారుల ఇండ్లలో తనిఖీ
- పది మందిపై కేసు, రూ.11 లక్షలు సీజ్

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 29 : అక్రమ వడ్డీ వ్యాపారం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్పీ చిత్తరంజన్ హెచ్చరించారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఏఎస్పీ ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు 50 మంది కానిస్టేబుళ్లతో కలిసి 15 బృందాలుగా ఏర్పడి ఆసిఫాబాద్‌లో అక్రమ చిట్టి, వడ్డీ వ్యాపారం చేస్తున్న పలువురి ఇండ్లలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సోదాలు నిర్వహించారు. పది మందిపై కేసు నమోదు చేయడంతో పాటు రూ. 11 లక్షలు సీజ్ చేశారు. వారి వద్ద ఉన్న బ్లాంక్ చెక్స్, ల్యాండ్ డాక్యుమెంట్లు, బాండ్ పేపర్లు, ప్రామిసరీ నోట్స్, ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు.

## అధికారుల నిలదీత

పెంచికల్ పేట్, ఏప్రిల్ 29 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని చేడువాయి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం లబ్ధిదారుల వివరాల నిర్ధారణకు వచ్చిన అధికారులను గ్రామస్తులు నిలదీశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎవరో కూడా తమకు తెలియదని, మరి ఎలా లబ్ధిదారులను గుర్తించారని అధికారులను ప్రశ్నించారు. దీంతో చేసేది ఏమి లేక అధికారులు వెనదురిగి వెళ్లిపోయారు.

అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న గ్రామస్తులు

# రేషన్ బియ్యం పట్టివేత

## 11 మంది రేషన్‌కార్డులు రద్దు

తాండూర్, ఏప్రిల్ 29 : మండలంలోని అచ్చలాపూర్‌లో నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. తహసీల్దార్ వివరాల ప్రకారం.. ప్రజా పంపిణీ సన్న బియ్యాన్ని అచ్చలాపూర్‌లోని 11 మంది కార్డుదారులు వినియోగించకుండా గ్రామంలోని కొంకుముట్టి మహేశ్ అనే వ్యాపారికి రూ.16 కిలో చొప్పున మొత్తం ఒక క్వింటాల్ 91 కిలోల బియ్యాన్ని విక్రయించారు. కలెక్టర్, పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు కొంకుముట్టి మహేశ్ నివాసానికి వెళ్లి తనిఖీ చేయగా సన్నబియ్యం నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంలో విచారణ జరిపి కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులకు పూర్తి నివేదిక పంపించామన్నారు. వారి ఆదేశాల మేరకు బియ్యం అమ్మిన కార్డుదారుల రేషన్ కార్డులు రద్దు చేశామని తెలిపారు. అదేవిధంగా సన్న బియ్యం కొనుగోలు చేసిన కొంకుముట్టి మహేశ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తాండూర్ ఎస్ఐకి లేఖ పంపించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్ఐ ఎజాజుద్దీన్ ఉన్నారు.

అచ్చలాపూర్‌లో రేషన్ బియ్యం సీజ్ చేసిన తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్

## నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

నస్పూర్, ఏప్రిల్ 29 : మంచిర్యాల జిల్లాలో మే 4వ తేదీన నిర్వహించే నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాలలోని బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పరీక్షకు 1204 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించబడవని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఆయన వెంట డీసీపీ భాస్కర్, అధికారులు ఉన్నారు.

## తాగునీటి కష్టాలు

*కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటల మండలం వీరవెల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో చేతిపంపు కొద్ది రోజుల నుంచి పని చేయకపోవడంతో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. కాలనీవాసులు నీటి కోసం బోర్‌మోటర్ ఉన్న వాళ్ల ఇండ్లకు వెళ్లి అడిగి తెచ్చుకుంటున్నారు. పలు మార్లు పంచాయతీ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా రాకపోవడంతో తాగునీటి సమస్య మరింత పెరిగింది. వెంటనే అధికారులు స్పందించి చేతి పంపు మరమ్మతు చేసి తాగునీటి కష్టాలు తీర్చాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.* - కౌటాల, ఏప్రిల్ 29

వీరవెల్లిలో పని చేయని చేతి పంపు వద్ద గ్రామస్తులు